కూటమి ప్రభుత్వం వస్తే అన్ని అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని జనం నమ్మి వైసీపీని మట్టికరిపించి కూటమికి ఓట్లేసి అధికారంలోకి తెచ్చారు. కానీ ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు కానరావడం లేదు. గత ప్రభుత్వంలో కొనసాగినట్లే అన్ని అసాంఘిక కార్యక్రమాలు, నేరాలు యథాతథంగా సాగుతున్నాయి. గతంలో వైసీపీలో ఉండి అక్రమ కార్యకలాపాలు సాగించిన వారే ఎన్నికల ముందు టీడీపీలో చేరి తిరిగి అదే హవా సాగిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే అంతకంటే ఎక్కువగా విచ్చలవిడిగా తమ దందా సాగిస్తున్నారు. గతంలో వైసీపీ వారు మాత్రమే దందాలు సాగిస్తే.. ఇప్పుడు టీడీపీ వైసీపీ వారు తగ్గేదేలే.. అన్నట్టుగా తమ అవినీతి కార్యకలాలు కొనసాగిస్తున్నారు. ఈ వ్యవహారాలు ప్రొద్దుటూరులో మరీ ఎక్కువగా ఉన్నాయి.



విచ్చలవిడిగా..

- వైసీపీ, టీడీపీ ఇసుక దందా
- ఒన్‌టౌన్, రూరల్ స్టేషన్ల అడ్డాగా ఇసుక మాఫియా
- రామాపురం, నంగనూరుపల్లె ఏరియాల్లో భారీగా ఇసుక డంపులు
- ఇసుక రవాణాపై ఎస్‌ఈబీ టాస్క్‌ఫోర్స్ దాడులు
- రెండు ట్రాక్టర్లు సీజ్
- ఒన్‌టౌన్ పరిధిలో ఇసుక మాఫియా ఘర్షణలు
- కొత్త ఎస్పీ, కలెక్టర్ ప్రొద్దుటూరుపై దృష్టి పెట్టేనా..

ప్రొద్దుటూరు, జూలై 17: జిల్లాలో కడప తరువాత అంత పెద్దఎత్తున రియల్ ఎస్టేట్ జరుగుతున్నది ప్రొద్దుటూరులోనే. మండల పరిధిలో వేలాది ఎకరాల్లో వెంచర్లు వేసి ఇళ్ల నిర్మాణాలు సాగుతున్నాయి. అందువల్ల ఇసుకకు ఇక్కడ పెద్దగిరాకి ఉంది. ఇదే అదనుగా అధికారం అడ్డుపెట్టుకుని గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణాను ఆ పార్టీవారే నేరుగా సాగించి అక్రమంగా కోట్లు వెనకేసుకున్నారు. ఇసుకను అందరినీ తోలుకోనిచ్చేవారు కాదు. కేవలం వైసీపీ కార్యకర్తలు, నాయకులు, వారి డ్రైవర్లు, గన్‌మెన్‌లు, అనుచరులు తప్ప ఇతరులకు అవకాశం ఉండేది కాదు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత ఇసుక పాలసీని తీసుకురావడంతో దీనిపై అవగాహన లేక ఎక్కడపడితే అక్కడ నదిలోంచి తవ్వకుని తీసుకు వెళ్లవచ్చని ఇప్పుడు వైసీపీ, టీడీపీ అనే భేదం లేకుండా అందరు రంగంలోకి దిగారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక మాఫియా నడిపిన వారిలో కొందరు ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. వీరంతా ఎక్కడ అధికారం ఉంటే అక్కడ ఇసుక దందా నడిపించుకోవడం కోసం పార్టీలు మారుతుంటారు. ఇప్పుడు టీడీపీలో ఉండి ఇసుక దందా నడిపిస్తున్నారు. వీరితో పాటు వైసీపీకి చెందిన వారు కూడా ఇసుక దందా సాగిస్తున్నారు. ముఖ్యంగా పెద్దశెట్టిపల్లె, రామాపురం, కొత్తపేట, చౌటపల్లె దొరసానిపల్లె రామేశ్వరం, ఈశ్వర్‌రెడ్డినగర్, పెన్నానగర్, నంగనూరు పల్లె, కల్లూరు గ్రామాల్లో పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్నారు.

ఒన్‌టౌన్, రూరల్ స్టేషన్ల అడ్డాగా..

ప్రొద్దుటూరులో ఒన్‌టౌన్, రూరల్ పోలీసు స్టేషన్లను అడ్డాగా చేసుకుని పోలీసు అధికారులకు మామూళ్లు ఇచ్చుకుని ఇసుక అక్రమరవాణా సాగిస్తున్నారనే విమర్శలున్నాయి. అంతేకాకుండా గత ఐదేళ్లలో ఈ రెండు స్టేషన్ల పరిధిలో అధికారులు, సిబ్బంది కోట్ల రూపాయలు ఇసుకలోనే సంపాదించారని ప్రచారం ఉంది. ప్రొద్దుటూరు రూరల్ పరిధిలోని చౌడూరు, రామాపురం, పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె రామేశ్వరం, నంగనూరుపల్లె, కల్లూరు గ్రామాల పరిధిలో భారీగా ఇసుక డంపులు నిల్వపెట్టి రాత్రిళ్లు అక్రమ రవాణా సాగిస్తున్నారు. ఇటీవలే నంగనూరుపల్లె వద్ద రెండు పెద్ద లారీలలో ఇసుక లోడ్లను సైతం పోలీసులు పట్టుకున్నారు. ఇసుకను లోకల్‌గా తోలడంతో పాటు చాగలమర్రి, ఆళ్లగడ్డ, నంద్యాల, కర్నూలు, గిద్దలూరు, మార్కాపురం లాంటి ప్రాంతాలకు లారీలు, ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తున్నారు.



రామాపురం ఏరియాలో ఇసుక డంపు

నామమాత్రపు దాడులు

ప్రొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున సాగుతున్న విషయంపై పత్రికల్లో కథనాలు రావడంతో అప్పుడప్పుడు తమ ఉనికిని చాటుకునేందుకు రెవెన్యూ, పోలీసు, ఎస్‌ఈబీ అధికారులు నామమాత్రపు దాడులు చేస్తుంటారు తప్ప.. పూర్తి స్థాయిలో నియంత్రించే చర్యలు చేపట్టలేదు. ఐదేళ్లుగా వైసీపీ వారు నేరుగా ఇసుక అక్రమ రవాణాలో ఉండటం వలన వారు అధికారులను పూర్తిగా తమ అదుపులో ఉంచుకుని ఇసుక దందా సాగించారు.

అధికారంలోకి వచ్చి నెలదాటినా..

ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రొద్దుటూరులో ఇసుక, భూదందాలను, మట్కా గుట్కా క్రికెట్ బెట్టింగ్ జూదం లాంటి అన్ని అసాంఘిక నేరాలను అరికట్టడమే తన ధ్యేయంగా ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చి ఓట్లేయించుకున్నారు. కానీ ప్రభుత్వం వచ్చి నెలరోజులు దాటినా అన్ని అసాంఘిక కార్యకలాపాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ముఖ్యంగా ఇసుక అక్రమ రవాణాతో పాటు జూదం, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లు సాగుతున్నాయి. కొందరు పోలీసు అధికారులు ఇక్కడ త్వరలో తాము బదిలీ అవుతాము కదా అని అందినకాడికి అవినీతికి పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇటీవల జూద గృహాలు నడుపుతున్న అధికార పార్టీకి చెందిన వారినుంచి పోలీసు అధికారి ఏకంగా మూడు లక్షలు లంచంగా తీసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. జూదగృహాలు రూరల్ పరిధిలోనే ఉండటంతో ఆ స్టేషన్ల అధికారుల కనుసన్నల్లోనే ఇవి నడిపిస్తున్నారు. వీరికి రోజు మామూళ్లు ముడుతున్నట్లు సమాచారం.

రెండు ట్రాక్టర్లు సీజ్

ప్రొద్దుటూరులో మంగళవారం తెల్లవారుజామున ఎస్‌ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రామేశ్వరం బైపాస్ రోడ్డుపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను రెండింటిని పట్టుకున్నారు. మరో ట్రాక్టరును వెంబడించగా ఆ ట్రాక్టరు డ్రైవర్ లైట్లు ఆపి చీకట్లో పొలాల్లోకి వెళ్లాడు. దీంతో ట్రాక్టర్ పల్టీకొట్టి డ్రైవరు కమటం ప్రతాప్ (24) అనే యువకుడు మరణించాడు. ఈ ట్రాక్టరు చౌటపల్లెలోని అధికార పార్టీకి చెందిన వ్యక్తులదని చెబుతున్నారు. ఒన్‌టౌన్ పోలీసు స్టేషను పరిధిలో సోమవారం మధ్యాహ్నం హనుమంతు అనే ఇసుక అక్రమ రవాణాదారుడు తన డ్రైవర్ వీరేశ్‌తో ట్రాక్టర్ ద్వారా తొక్కించి చంపడానికి ప్రయత్నించాడని.. షఫీ, అలీషేర్, మహేంద్ర అనే వ్యక్తులు హనుమంతుపై దాడిచేశారు. దీంతో అతను హాస్పిటల్‌లో చేరాడు. దీనిపై ఒన్‌టౌన్ పోలీసులు దాడి కేసు నమోదు చేశారు. ఇక్కడ కూడా అధికార పార్టీకి చెందిన మైనారిటీ చోటా నేతలు ఇద్దరు ఆ ఏరియాలో ఇసుక దందాను నడుపుతు పరస్పరం ఘర్షణలకు పాల్పడుతున్నారు. ఇదిలా ఉండగా హనుమంతుపై దాడిచేసిన వారిలో అలీషేర్ తమ్ముడు జాఫర్ సోమవారం రాత్రి 9.30 గంటలకు ఇంటికి వస్తూ బైపాస్ రోడ్డులోని పెట్రోల్ బంక్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో గాయపడ్డాడు. ఇది ఉదయం జరిగిన ఘర్షణకు ప్రతీకారంగా జరిగిందని భావిస్తున్నారు. ఇలాంటివి ప్రొద్దుటూరులో నిత్యం ఏదోచోట జరుగుతూనే ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. జిల్లాకు కలెక్టర్, ఎస్పీ ఇద్దరూ కొత్తగా వచ్చారు. వీరు ప్రొద్దుటూరులో ఇసుక అక్రమ రవాణాతో పాటు జూదం పేకాట క్రికెట్ బెట్టింగ్ లాంటి అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి సారించి కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మంగళవారం తెల్లవారుజామున పొలంలోకి దూసుకెళ్లిన ఇసుక ట్రాక్టర్

ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం

- ఎర్రచందనం, గంజాయిపై ఉక్కుపాదం
- బెట్టింగ్, చట్టవ్యతిరేక కార్యకలాపాలపై కఠిన చర్యలు
- గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక చర్యలు
- బాధ్యతలు చేపట్టిన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు



కడప (క్రైం), జూలై 17: జిల్లా ప్రజలకు పోలీసు శాఖ ద్వారా మెరుగైన సేవలు అదిస్తామని, ఎల్ల వేళలా అందుబాటులో ఉంటామని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. ఎర్ర చందనం అక్రమ రవాణా, గంజాయి విక్రయాలు, భూకబ్జాలు, బెట్టింగ్ తదిత ర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుం టామని అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించిన అనంతరం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ విలే కర్లతో మాట్లాడారు. అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో ఎస్పీగా పనిచేశానన్నారు కడప జిల్లా ఎస్పీగా వచ్చి ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా బావిస్తున్నా అన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజల సమస్యలు పరి ష్కరిస్తామన్నారు. గంజాయి నిర్మూలనకు ప్రణాళికతో చర్యలు తీసుకుం టామన్నారు. నగరంలో సీసీకెమెరాల ఏర్పాటుకు కలెక్టర్, కడప కమిషనర్‌తో కలిసి చర్చిస్తామన్నారు. గల్ఫ్ బాధితులను ఆదుకునేం దుకు జిల్లా పోలీసు శాఖ తరపున ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. అదనపు ఎస్పీ (పరి పాలన) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ క్రిష్ణారావు, డీఎస్పీలు ఎస్పీకి శుభా కాంక్షలు తెలిపారు. అలాగే జిల్లా పోలీసుల సంఘం అధ్యక్షుడు దూలం సురే శ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సిబ్బందికి వెల్ఫేర్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా మని ఎస్పీ పేర్కొనారు. అనంతరం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి ఒక్కో విభాగ పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయ విభాగం, కమ్యూనికేషన్ విభాగం, కోర్టు మానిటరీ సెల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగ కార్యాలయాలను పరిశీలించారు.

కడప రాయుడి సేవలో నూతన ఎస్పీ



కడప (కల్చరల్), జూలై 17: జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధన్‌రాజు తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుమల తొలిగడపగా ఖ్యాతిగాంచిన దేవుని కడప శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదనంతరం ఆలయ అర్చకులు స్వామివారి ప్రసాదాలను ఎస్పీకి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లా ప్రాజెక్టులు పూర్తి చేయండి

- గడ్కరీకి రవాణా మంత్రి మండిపల్లి వినతి

మదనపల్లె, జూలై 17: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లాలో జరుగుతున్న వివిధ జాతీయ రహదారుల ప్రాజెక్టులు పూర్తి చేయాలని కేంద్ర మంత్రి నితి న్ గడ్కరీని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కోరారు. బుధవారం మదనపల్లెకు విచ్చేసిన కేంద్ర మంత్రికి చిప్పిలి సమీపంలోని హెలిప్యాడ్‌లో ఘనస్వాగతం పలికిన మండిపల్లి వివిధ అంశాలపై కేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఇందులో రాజంపేట-రాయచోటి, రాయ చోటి-కదిరి రాష్ట్ర రహదారి నుంచి జాతీయ రహదారిగా 135 కి.మీ. మార్చు చేయాలని కోరారు. అలాగే రాజంపేట వద్ద ఎన్‌హెచ్-716 (రేణిగుంట-కడప రోడ్డు), రాయచోటి వద్ద ఎన్‌హెచ్-40 (కర్నూలు-చిత్తూరు-రాణిపేటరోడ్), కదిరి వద్ద ఎన్‌హెచ్-42 (ఉరవకొండ-అనంతపురం-కదిరి-మదనపల్లె-కృష్ణ గిరి రోడ్డు), ఎన్‌హెచ్-40కి సంబంధించి కడప-రాయచోటి రోడ్ నుంచి రెండు లేన్ల నుంచి నాలుగులేన్లకు విస్తరించాలని కోరారు. అలాగే సీఆర్‌ఎఫ్ పథకం కింద రూ.109.70 కోట్ల అంచనా వ్యయంతో 72.180 కి.మి. ఆరు లేన్ల విస్తరణ పనులు చేపట్టాలని కేంద్ర మంత్రిని కోరారు. కేంద్ర మంత్రికి స్వాగతం పలి కిన వారిలో మండిపల్లెతో పాటు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధ ర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు, జేసీ ఫర్మాన్ అహ్మద్ తదితరులు ఉన్నారు.

కర్ణాటకలో పీఎఫ్ నిధుల గల్లంతుపై కాశినాయనలో కలకలం

- కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల మండలాల్లో..
- సీబీఐ అధికారుల దర్యాప్తు

కాశినాయన, జూలై17: కర్ణాటకలో పీఎఫ్ నిధుల గోల్‌మాల్ వ్యవహారంలో అక్కడి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించడంతో కాశినాయన మండలం లో కలకలం రేగుతోంది. పీఎఫ్ డబ్బులు మాయం కావడం వెనక కాశినాయ న మండలానికి చెందిన వ్యక్తి ప్రమేయం ఉన్నట్లు సమాచారం అందడంతో సీబీఐ అధికారులు ఇక్కడకు వచ్చి విచారణ చేపట్టారు. వివరాలిలా..

కాశినాయన మండలంలోని వడ్డమాను గ్రామానికి చెందిన కొత్తకోట శ్రీనువాసులు కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో పీఎఫ్ కార్యాలయంలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. బెంగళూరులో పలు సంస్థలకు చెందిన పీఎఫ్ ఫండ్స్ పక్కదారి పట్టాయని ఇటీవల వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న కర్ణాటక ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా సీబీఐ అధికారులు బుధవారం కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బీ.కోడూరు మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో శ్రీనివాసు లు బంధువులు, స్నేహితులు, పలువురు నాయకుల బ్యాంక్ ఖాతాలను పరిశీ లించారు. ఈ నాలుగు మండలాల పరిధిలోని వందలమంది ఖాతాదారుల అకౌంట్లకు నగదు బదిలీచేసి వారి నుంచి శ్రీనివాసులు డబ్బు డ్రా చేయించు కొన్నట్లు సీబీఐకి తెలిసింది. దీంతో ఇప్పటికే పలువురి బ్యాంక్ ఖాతాలను సీబీఐ స్తంభింపచేసినట్లు సమాచారం. బుధవారం పలువురు ఖాతాదా రులను పెండ్లిమర్రి కస్తూర్బాపాఠశాల సమీపంలోని ఓ ఫామ్ హౌస్ వద్దకు పిలిపించుకుని గంటల కొద్ది విచారించి, వారి వివరాలను సేకరించి స్టేట్‌మెం ట్లు నమోదు చేశారు. ఈ పీఎఫ్ కుంభకోణంలో ముమ్మందు ఎంతమంది ఇరుక్కుంటారోనని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎడారిలో మెతుకుల వేట

"బతుకు దెరువు కోసం.. కువైత్‌కు వచ్చా.. ఇక్కడ ఎడారిలో ఒక్కడినే ఉన్నా.. చాలా కష్టంగా ఉంది.. తాగడానికి నీళ్లు కూడా లేవు. నా గోడు ఎవరికైనా చెప్పుకుందామన్నా.. కనుచూపు మేర ఎవరూ లేరు.. దయచేసి ఎవరైనా సాయం చేసి ఆదుకోండి.. ఇంటికి రప్పించండి.. లేకుంటే ఒకటి రెండు రోజుల్లో చచ్చిపోతా.." అంటూ.. ఏడుస్తూ.. వీడియో చేసిన అయివేటి శివ గురించి.. ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయిన విషయం రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలియని వాళ్లు ఉండరేమో.? వాల్మీకిపురం మండలం చింతపర్తిలో నివాసం ఉంటూ.. ఊరూరు తిరిగి పాత్రలు విక్రయిస్తూ.. రోజుకు ఎంతోకొంత సంపాదిస్తూ.. ఉన్నదాంట్లో ప్రశాంతంగా భార్య, ఇద్దరు పిల్లలతో జీవితం గడపాల్సిన శివ.. ఎడారిలో మెతుకుల వేటకు ఎందుకు వెళ్లాడు? అక్కడ విధి వక్రీకరించి.. సమస్యల ఉచ్చులో ఎలా చిక్కుకున్నాడు.. ఎవరు దయ తలచడంతో ఇంటికి చేరుకున్నాడు.? ఎడారి దీవిలో అతను పడ్డ కష్టాలు..? అతని జీవితం రాయలసీమ ప్రాంతం లోని కరువుకు దర్పణంగా చెప్పుకోవచ్చు.



బెంగళూరు విమానాశ్రయంలో శివ, కుటుంబసభ్యులు

- విధి వక్రీకరించి ఉచ్చులో చిక్కి..
- మంత్రి నారా లోకేశ్ చొరవతో ఎట్టకేలకు ఇంటికి..
- రాయలసీమ కరువునకు దర్పణం.. శివ జీవితం



(రాయచోటి-ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురం మండలం చింతపర్తిలో బోయకులానికి చెందిన అయివేటి శివ భార్య శంకరమ్మ, కూతుళ్లు వెన్నెల, వనితతో కలిసి ఓ బాడుగ ఇంట్లో నివాసం ఉండేవాడు. ఇతనికి సెంటు భూమి కూడా లేదు. అతను ఊరూరా స్కూటర్‌లో తిరుగుతూ వంటపాత్రలు అమ్మి జీవించేవాడు. ఒక్కోరోజు రూ.500 నుంచి వెయ్యి రూపాయల వరకు ఆదాయం వచ్చేది. ఒక్కో రోజు కనీసం రూ.రెండు, మూడు వందలు కూడా వచ్చేది కాదు. ఒక్కోసారి స్కూటర్ పెట్రోల్‌కు సైతం టమోటా తోటల్లో కూలి పనులకు వెళ్లే భార్య ఇవ్వాల్సి వచ్చేది. ఇద్దరూ ఆడపిల్లలే.. ఇలా చాలీచాలని సంపాద నతో ఎలా బతకాలి. పిల్లలకు పెళ్లిళ్లు ఎలా చేయాలి అనుకుంటూ సతమతమవుతూ జీవనం సాగించే వాళ్లు. భార్య, పెద్ద కూతురు ఇద్దరూ టమోటా తోటల్లో కూలి పనులకు రోజూ వెళ్లేవాళ్లు. అయినా సంపాదన ఆశించినంత ఉండడం లేదు. ఈ సమస్యలన్నీ తీరా లంటే శివ కువైత్‌కు వెళ్లడమే మార్గమనుకున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు.

జగనన్న ఇంటి కోసం అప్పులు..

శివ కువైత్‌కు వెళ్లడానికి ప్రధాన కారణం అప్పులు. వీళ్లకు సుమారు ఆరేడు లక్షల వరకు అప్పులు ఉన్నాయి. ఈ అప్పులు ఎందుకు అయ్యాయంటే..? పెద్ద కథే ఉంది. వీళ్లకు సొంత ఇల్లు లేకపోవడంతో గత ప్రభుత్వంలో జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చారు. అప్పు చేసి పునాది వరకు వేసుకున్నారు. అందరూ ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని లేదంటే ఆ స్థలాలు వేరే వాళ్లకు ఇచ్చేస్తామని అప్పట్లో అధికారులు ఒత్తిడి తెచ్చేవారు. ఈ నేపథ్యంలో పునాదిపైన గోడలు పూర్తి చేశారు. ఇక కేవలం మోల్డింగ్ మాత్రమే మిగిలి ఉంది. ఇందుకు గానూ.. సుమారు రూ.6 లక్షల వరకు అప్పు చేశారు. ఎలాగూ కువైత్‌కు వెళ్తా.. అనే ఉద్దేశ్యంతో ఇల్లు కట్టడానికి ఖర్చుపెట్టడంలో వెనుకాడలేదు.

అనధికార ఏజెంట్లు.. అవస్థలు

కువైత్‌కు వెళ్లాలని రాయచోటిలో ఒక అనధికార ఏజెం టును ఆశ్రయించారు. పాసుపోర్టు కోసం, వీసా కోసం సుమారు రూ.లక్ష వరకు ఖర్చు చేశారు. గత నెల 9న కువైత్‌కు వెళ్లాడు. అక్కడ పట్టణానికి దూరంగా ఎడా రిలో పనికి వదిలారు. అక్కడ బాతులు, గొర్రెలు, ఒంటె లు ఉన్నాయి. అప్పటి వరకు అక్కడ ఉన్న శ్రీలంకకు చెందిన వ్యక్తి గత నెల చివరిలో స్వదేశానికి వెళ్లిపో యాడు. దీంతో శివకు కష్టాలు మొదలయ్యాయి. అక్కడ ఒక్కడే ఉండాల్సి వచ్చింది. ఎండకు తట్టుకోలేకపోయా డు. తన గోడు చెప్పుకునేందుకు కనీసం ఒకరు కూడా లేరు. దీంతో ఒంటరిగా ఉండలేక.. తన భార్యకు ఫోన్ లో గోడు వెల్లబోసుకున్నాడు. చేసిన అప్పులు తీర్చే దెలా..? ఓపిక పెట్టుకో.. ఎలాగైనా ఉండిపో అని భార్య సర్దిచెప్పింది. అయితే రోజురోజుకు భరించలేక.. తన బాధలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశాడు. ఇది వారం రోజుల్లో పూర్తిస్థాయిలో వైరల్ అయింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎందరో చూశారు. అయ్యో పాపం.. ఎవరు ఇతను..? ఏ ఊరు.? ఎవరైనా కాపాడాలి అని కోరుకున్నారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్పందించారు. కేంద్ర ప్రభుత్వ అధికారులతో మాట్లాడారు. అదే సమ యంలో కువైత్‌లో ఉన్న ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నాయకుల తోనూ మాట్లాడారు. వెంటనే ఆ నాయకులు శివ ఆచూకీ తెలుసుకుని నారా లోకేశ్‌కు సమాచారం అందించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల అధికారులు జోక్యం చేసుకోవడంతో శివ కువైత్‌లోని భారత రాయ బార కార్యాలయానికి సోమవారం చేరుకున్నారు. మంగ ళవారం రాత్రి బయలుదేరి బుధవారం తెల్లవారుజామున బెంగళూరు విమానాశ్రయానికి చేరు కున్నారు. అక్కడి నుంచి బుధవారం స్వగ్రామానికి చేరు కున్నారు. అతడిని చూడగానే విమానాశ్రయంలో భార్య, పిల్లలు ఏడుస్తూ కౌగిలించుకున్నారు. తమ తండ్రి క్షేమంగా తమ వద్దకు రావడానికి కారణమైన.. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలకు ధన్యవా దాలు తెలిపారు.

శివ కథనం మేరకు.. తనకు వీసా తీసేట ప్పుడు చెప్పింది ఒకటి.. కువైత్‌లో జరిగింది మరొకటి. ఇక్కడేమో 130 దీనార్లు జీతమని చెప్పారు, అయితే అక్కడ 100 దీనార్లు మాత్రమే ఇస్తామన్నారు. గొర్రెల వద్ద కాపలాదారునిగా ఉండాలని చెప్పారు, అయితే.. అక్కడ ఉన్న పరిస్థితి వేరని వాపోయాడు. ఏజెంట్లు తమకు చెప్పేది ఒకటైతే.. కువైత్‌లో జరుగుతోంది మ రొకటని పేర్కొన్నారు. శివ ఎదుర్కొంటున్న సమస్యలే సాధారణంగా ఎక్కువ మంది ఎదుర్కొంటున్నారు. వీసా కోసం కువైత్‌లో షేర్ డబ్బు ఇచ్చినా.. మళ్లీ ఇక్కడ కూడా కువైత్‌కు వెళ్లే వాళ్ల దగ్గర డబ్బు వసూలు చేస్తు న్నారు. ప్రస్తుతం బాధితుడు శివ జీవితం.. కువైత్.. అక్కడ కష్టాలు.. రాయలసీమలో కరువు పరిస్థితులకు దర్పణంగా చెప్పవచ్చు. ఎందరో ఇక్కడ సరైన వానలు లేక.. పంటలు పండక.. బతకడం కష్టమై.. కువైత్, దు బాయి వంటి గల్ఫ్ దేశాలకు వలసలు వెళుతున్నారు. జిల్లాలోని రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, తంబ ళ్లపల్లె, పీలేరు ప్రాంతాల నుంచి దాదాపు ప్రతి పల్లెలో గల్ఫ్ దేశాలకు వెళ్లిన వాళ్లు కనిపిస్తారు. అయితే అక్కడ కష్టాలు భరించలేక తిరిగి వస్తున్న శివలు కొందరైతే.. చేసిన అప్పులు తీర్చేదారిలేక.. అక్కడే జీవచ్ఛవాల్లా ఉంటున్న వాళ్లు వేలల్లో ఉంటున్నారు.

ఘనంగా మొహర్రం



పోరుమామిళ్లలో ఊరేగింపుగా వెళుతున్న పీర్లు

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకలు బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. మొహర్రం చివరి రోజు కావడంతో హిందువులు, ముస్లింలు కలిసి పీర్లను ఊరేగించారు. సమీప బావులు, నదుల వద్దకు తీసుకెళ్లి జల్దికార్యక్రమం నిర్వహించడంతో పీర్లపండుగ ముగిసింది.



చక్రాయపేట మండలం సురభి రెడ్డివారిపల్లె పీర్లువడ్డువాగు వద్ద జల్ది కార్యక్రమం

ఎస్కేయూలో విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

● సీపీఆర్‌తో ప్రాణం నిలిపిన సహ విద్యార్థినులు


సర్వజన వైద్యశాలలో మౌనికకు చికిత్స చేస్తున్న వైద్యులు

అనంతపురం సెంట్రల్, జూలై 17: ఎస్కేయూ విద్యార్థిని మౌనిక బుధవారం ఆత్మహత్యకు యత్నించింది. కడప జిల్లా పులివెందులకు చెందిన మౌనిక, ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వర్సిటీ బాలికల వసతి గృహంలోని తన గదిలో నైలాన్ తాడుతో ఉరివేసుకుంది. సహ విద్యార్థినులు సకాలంలో గమనించి సిబ్బంది సాయంతో రక్షించారు. వెంటనే సీపీఆర్ చేసి ప్రాణం పోశారు. అక్కడి నుంచి అనంతపురం సర్వజన వైద్యశాలకు తరలించారు. విద్యార్థిని పరిస్థితి నిల కడగా ఉందని వైద్యులు తెలిపారు. వర్సిటీ రెక్టార్ వెంకటనాయుడు, డిప్యూటీ వార్డెన్‌లు అనిత, శ్రీరాములు, ఎంబీఏ ప్రొఫెసర్‌లు ప్రభాకర్, మురళీకృష్ణ ఆసు పత్రికి చేరుకుని విద్యార్థిని ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఇండస్ట్రి యల్ టూర్‌లో భాగంగా ఈనెల 10 నుంచి 16 వరకు కేరళ, తమిళనాడులోని పలు పరిశ్రమలను వర్సిటీ ఎంబీఏ విద్యార్థులు సందర్శించి వచ్చారు. ఆ సమ యంలో సహ విద్యార్థులతో మౌనిక ఆనందంగా గడిపారని వర్సిటీ అధికారులు తెలిపారు. హాస్టల్ గదిలోని ఇతర విద్యార్థినులు అల్పాహారం కోసం వెళ్లిన తరు వాత, ఉదయం 9.30 గంటల సమయంలో మౌనిక ఆత్మహత్యకు యత్నించిందని వారు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సర్వజన వైద్యశాలకు వచ్చి బోరున విలపించారు. మౌనిక ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో తెలియరాలేదు. విద్యార్థిని కోలుకున్నాక విషయం తెలుస్తుందని వర్సిటీ వర్గాలు అన్నాయి. విద్యార్థిని ఆత్మహత్యకు యత్నించడానికి కారణాలు ఏమిటో ఇంకా తెలియదని, అందుకే కేసు నమోదు చేయలేదని ఇటుకలపల్లి సీఐ నరేంద్ర నాథ్‌రెడ్డి తెలిపారు.

ప్రాణం పోశారు..

మౌనిక ఉరితాడుకు వేలాడుతుండగా గమనించిన సహ విద్యార్థినులు కేకలు వేసి హాస్టల్ సిబ్బందిని పిలిచారు. వారి సాయంతో తలుపులు బద్దలు కొట్టి లోపలికి వెళ్లారు. మౌనికను కిందికి దించి.. కొన ఊపిరితో ఉన్నట్లు గుర్తించారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండటంతో సమయస్ఫూర్తి ప్రదర్శించారు. కింద పడుకోబెట్టి గుండె భాగంలో ఒత్తుతూ.. నోటితో ఊపిరి ఊదారు. దీంతో మౌనిక కళ్లు తెరిచింది. ఆ వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఉరి కారణంగా మెదడుకు ప్రాణవాయువు అందడం కష్టమౌతుందని, మౌనికకు సహ విద్యార్థినులు సీపీఆర్ చేయకపోయి ఉంటే ప్రాణాపాయం ఏర్పడేదని వైద్యులు అన్నారు. ప్రస్తుతానికి ప్రాణాపాయం లేదని, మరో 24 గంటలపాటు పరిశీలించాల్సి ఉందని అన్నారు.

హత్యకేసులో నిందితుడి అరెస్టు


అన్వర్‌బాషను అరెస్టు వివరాలు తెలియజేస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం, జూలై 17: సోములవారిపల్లె పంచాయతీ పరిధిలోని పాలకేంద్రం వెనుక వైపున ఈ నెల 12వ తేదీ రిజ ర్వు ఫారెస్టులో భార్యను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఇందుకు సంబంధించి బుధవా రం స్థానిక రూరల్ పోలీస్‌స్టేష న్‌లో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని అమృతానగర్‌కు చెందిన షేక్ అన్వర్‌బాష తన భార్య రేష్మాపై అ నుమానంతో విడాకులు ఇచ్చి రెండో పెళ్లి చేసుకోవాలని భావించాడు. ఆమె వి డాకులు ఇవ్వకపోవడంతో అడ్డుతొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. పథకం ప్రకారం ఈ నెల 12వ తేదీ పెన్నానగర్ పార్క్‌కు పోదామని పిలుచుకుపోయి, అక్కడి నుంచి పాలకేంద్రం వెనుకవైపున ఉన్న ఇసుకదిన్నెలలోకి తీసుకెళ్లి ఆమె గొంతు నులిమి హత్య చేశాడు. ఈ మేరకు నిందితుడు అన్వర్‌బాష నేరం అంగీకరండంతో అతన్ని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. అతని వద్ద నుంచి ఒక మోటారు సైకిల్, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. సమావేశంలో సీఐ రమణారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

పథకం ప్రకారం భర్తను హత్య చేయించిన భార్య

మైలవరం, జూలై 17 : మండల పరిధిలోని వద్దిరాల గ్రామ పొలాల్లో జూన్ 21వ తేదీ అనుమానస్పదస్థితిలో మృతి చెందిన దూదేకుల హుస్సేనయ్య(34)ను అతని భార్యే పథకం ప్రకారం హత్య చేయించిందని జమ్మలమడుగు రూరల్ సీఐ గోపాల్ రెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు... పెద్దముడియం గ్రామానికి చెందిన హుస్సేనయ్య మైలవరం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సమీ పంలోని కంకర మిషన్‌లో పని చేస్తుండేవాడు. కాగా, హుస్సేనయ్య భార్య కరీ మూన్ అదే గ్రామానికి చెందిన కుమ్మర వెంకట సుబ్రమణ్యంతో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయం హుస్సేనయ్యకు తెలిసిపోవడంతో అతన్ని అడ్డుతొలగించుకోవాలనే ఉద్దేశ్యంతో పథకం ప్రకారం వద్దిరాల గ్రామానికి హుస్సే నయ్యను రప్పించి.. మందు తాపించి మద్యం మత్తులో సుబ్రమణ్యం గొంతు నులిపి చంపారు. దీనిపై గత నెల 21న తలమంచిపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులోని నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి బుధవారం జమ్మలమడుగు కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించామని సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

జమ్మలమడుగు, జూలై 17: జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామం కోవెలకుంట్ల రోడ్డులో ఏవీఎన్ అగ్రోటెక్ పప్పుల ఫ్యాక్టరీ వద్ద బావిలో పడి బుధవారం రోహిత్‌మోరే (20) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మధ్రప్రదేశ్‌లోని కాండవాజిల్లా నర్మదాన గర్‌కు చెందిన రోహిత్‌మోరే పప్పుల ఫ్యాక్టరీలో కూలి పనిచేస్తున్నాడు. గత కొం త కాలంగా మృతుడితోపాటు అతని బంధువులు అక్కడ కూలి పని చేసుకు ంటూ జీవిస్తున్నారు. అయితే జరిగిన ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియరాలేదు. మృతుడి మేనమామ అజయ్ గద్వాల్ ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి విచారణ చేస్తున్నట్లు అర్బన్ పోలీసులు తెలిపారు. అయితే పప్పుల ఫ్యాక్టరీ వద్ద చుట్టూ కూలీలకు ఏమైనా సమస్యలున్నాయా, మృతుడికి ఎవరైనా ఇబ్బంది కలిగించారా అన్న అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'పట్టు' తప్పిన సాగు

● కనుమరగవుతున్న మల్బరీ పంట
● 3 వేల ఎకరాలు నుంచి 50 ఎకరాలకు పడిపోయిన వైనం
● ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తున్నా.. గిట్టుబాటు ధరల్లేక ముందుకు రాని రైతులు
● పంటసాగు మానేసిన రైతులు


నిరుపయోగంగా ఉన్న చంద్రికలు


గద్దగుండ్లరాచపల్లెలో వదిలేసిన మల్బరీపంట


మల్బరీ పంటను తొలగిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, జూలై 17: ఒకప్పుడు లక్కిరెడ్డిపల్లె తాలూకా పరిధిలో మల్బరీ పంటను విస్తారంగా సాగుచేసేవారు. ఈ ప్రాంతంలో ఎక్కు వగా మెట్ట ప్రాంతం కావడం.. ఇక్కడ వర్షాలు పడితేగాని పంటలు సాగయ్యేవికావు. ఈనేపథ్యంలో 1990 సంవత్సరంలో ఈ ప్రాంతంలో బావులు, చెరువుల కింద మల్బరీ సాగుచేపట్టారు. అప్పట్లో మంచి దిగుబడులు, లాభాలు రావడంతో రైతులు పంటసాగుకు ఆసక్తి కనబరిచారు. దీంతో లక్కిరెడ్డిపల్లె డివిజన్ పరిధిలోని రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, చక్రాయపేట, వీరబల్లి మండలాలల్లో దాదాపు 3వేల ఎకరాలల్లో రైతులు మల్బరీ పంట సాగు చేశారు. ఆ తర్వాత కరువు సంభవించడం, గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పంటసాగు క్రమంగా తగ్గుతూ వచ్చింది.

2002 నుంచి మల్బరీ పంటసాగు క్రమంగా తగ్గు ముఖం పట్టింది. దీనికితోడు ఐదేళ్లు వర్షాలు కురవక బోర్లు, బావుల్లో నీళ్లు అడుగంటి పోవడంతో సాగుచేసిన పంట ఎండిపోయి రైతులు తీవ్రం గా నష్టపోయారు. దీంతో రైతున్నలకు పట్టుసాగుపై పట్టు తప్పింది. ఈ నేపథ్యంలో 2009 నుంచి క్రమంగా అన్ని మండలాలల్లో మల్బరీ సాగు తగ్గుముఖం పడుతూ వేల ఎకరాల నుంచి వందల ఎకరాలకు చేరింది. కాగా, 2012 నుంచి మల్బరీపంట సాగు పెంచేందుకు రైతు లకు అన్ని విధాలా ప్రభుత్వం తోడ్పాటు అందించింది. పంట సాగు చేసుకునే రైతులకు రూ.30వేలు ఇస్తోంది. సబ్సిడీతో ఆకు మేపుకోవ డానికి షెడ్లు, తట్టలు, మొక్కలు, మొక్కలు పెంచడానికి ఉచితంగా కూలీ డబ్బులు కూడా ప్రభుత్వం అందిస్తోంది. అంతేకాకుండా షెడ్ ఏర్పాటు చేసుకుంటే పెద్ద షెడ్డుకు 2,50,000 ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వగా.. రైతు 50,000 పెట్టుకోవాలి. మొత్తం 3 లక్షలు షెడ్డుకు, చిన్న షెడ్డుకు రూ.2లక్షలు ప్రభుత్వం అందిస్తోంది. అయినా రైతులు ముం దుకు రావడం లేదని పట్టుపరిశ్రమశాఖ అధికారులు చెబుతున్నారు. కాగా, లక్కిరెడ్డిపల్లె మండలంలోని పందిళ్లపల్లె గ్రామానికి చెందిన శివ అనే రైతు రూ.10లక్షలు ఖర్చు పెట్టి 20 ఎకరాలల్లో మల్బరీపంట సాగు చేసేవారు. కానీ ఏ రోజు కూడా లాభాలు రాలేదంటున్నారు. అష్టకష్టాలు పడి మల్బరీపంట సాగుచేసి పట్టుగూళ్లను మార్కెట్‌కు తీసుకెళితే తెల్లగూళ్లకు కిలో రూ.450, పచ్చగూళ్లకు కిలో రూ.300 ధర పలుకుతోంది. 2010 నుంచి ఇదే రేటు నడుస్తోంది. ప్రభుత్వం ప్రోత్సాహం కింద కిలోకి రూ.50లు ఇస్తున్నా గిట్టుబాటు కావడం లేదని చాలా మంది రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటను సాగుచేయడం మానేశామని...పట్టుగూళ్లకు రేటు పెంచితే తప్ప మల్బరీ పంట సాగుచేసే పరిస్థితి లేదని చెబుతున్నారు. ఇప్పటి కైనా ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు కాకపోవడంతో..



మాకు 5 ఎకరాలు భూమి ఉంది. 3 ఎకరాలలో మల్బరీపంట సాగు చేసి అప్పట్లో మంచి దిగుడబడులతో లాభాలు వచ్చాయి. 1985 నుంచి పంట మొదలు పెట్టి క్రమం తప్పకుండా మల్బరీపంట సాగుచేశాం. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పట్టుగూళ్లకు రేట్లు పెరగడం లేదు. అప్పట్లో కిలో రూ.300 రేటు ఉండేది. ప్రస్తుతం పచ్చగూళ్లకు రూ.350, తెల్లగూళ్లకు రూ.450 ఉంది. ధరలు గిట్టుబాటు కాకపోవడంతో మల్బరీ పంట సాగు చేపట్టడం లేదు.

-బొంతలపల్లె వెంకటరమణ, బూడిదగుంటపల్లె

నష్టాలు భరించలేక..



20 సంవత్సరాలుగా మల్బరీపంట సాగుచేశాం. అరకొరగా లాభాలు వచ్చేవి. అప్పట్లో రూ.10 లక్షలు ఖర్చుపెట్టి 7 ఎకరాల్లో మల్బరీపంట సాగుచేశాం. ఒక్క ఏడాది కూడా లాభాలు రాలేదు. చేసిన అప్పులు తీరలేదు. రూ.6లక్షలు ఖర్చు పెట్టి రెండు షెడ్లు ఏర్పాటు చేశాం. ఇంత వరకు కనీసం ఖర్చులు కూడా రాలేదు. మల్బరీపంటను తొలగించి ఏదైనా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు ఏడు ఎకరాలు పంటను దున్నేస్తున్నాం.

-ఆనందరాజు, గద్దగుండ్లరాచపల్లె, లక్కిరెడ్డిపల్లె

రైతులకు అవగాహన కల్పిస్తున్నా...

మల్బరీపంట సాగుపై అన్ని విధాల రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా పంట సాగుచేసేందుకు ముందుకు రావడం లేదు. కూలీలు దొరకడం లేదని.. వర్షాలు సక్రమంగా కురవడంలేదని రైతులు అంటున్నారు. ప్రభుత్వం మల్బరీపంట సాగుచేసే ప్రతి రైతుకు పోత్సాహం అందించడంతో పాటు అన్ని విధాల అధికారులు అందు బాటులో ఉన్నా ఎవరు ముందుకు రావడం లేదు.

-రవీంద్ర, సెరికల్చర్ అధికారి, లక్కిరెడ్డిపల్లె

పుష్పగిరి క్షేత్రాన్ని దర్శించుకున్న జిల్లా ప్రధాన జడ్జి


జడ్జి కుటుంబాన్ని ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

వల్లూరు, జూలై 17: పుష్పగిరి క్షేత్రాన్ని జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. జడ్జి ఆలయంలో రావడంతో అర్చకులు సుమంత్ స్వామి ఆలయ మర్యాదలతో స్వాగ తించారు. అనంతరం కొండమీద గల రాజ్యలక్ష్మీ సమేత, చెన్న కేశవ స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంతాన మల్లేశ్వ రునికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయ బద్ధంగా వారిని సత్కరించారు. పుష్పగిరి క్షేత్ర విశిష్టతను వారికి వివరించారు. వీరి వెంట ఆలయ సిబ్బంది తది తరులు పాల్గొన్నారు.

పుష్పగిరి ప్రదర్శనకు తాళ్ళపాక వంశస్తుడు రాక

ఈనెల 21వ తేదీ పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి ప్రదర్శన చేపడతారు. అందులో భాగంగానే తాళ్ళపాక అన్నమాచార్య వంశ స్తుడు హరినారాయణచార్యులు ఈ గిరి ప్రదర్శనలో పాల్గొంటా రని కార్యనిర్వాహకులు తెలియజేశారు. ప్రతి పౌర్ణమిలాగానే ఈ ఆషాఢ పౌర్ణమికి ఎంతో విశిష్టత ఉందని.. గిరి ప్రదర్శన చేస్తే సకల శుభాలు కలుగు తాయని భక్తుల నమ్మకం. ఈ గిరి ప్రదర్శనలో పాల్గొనేందుకు భక్తులు విరి విరిగా పాల్గొంటున్నారు. గిరి ప్రదర్శన అనంతరం హరినారా యణస్వామి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారని తెలియజేశారు.

కడప బుల్లోడికి ఐదు బంగారు పతకాలు

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్‌లో సత్తా చాటిన వైనం



స్విమ్మింగ్‌లో సత్తాచాటిన త్రిభువన్‌రెడ్డి

కడప (స్పోర్ట్స్) జూలై 17: రాష్ట్ర స్థాయి 40వ సబ్‌జూని యర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీల్లో కడపకు చెందిన బీక్కా త్రిభువన్‌రెడ్డి ఐదు బంగారు పతకాలు సాధించడమేకాక వ్యక్తిగత విభాగంలోనూ రాణిం చి సత్తా చాటాడు. కర్నూలు జిల్లా ఆక్వాటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 13, 14, తేదీల్లో కర్నూలు డీఎస్‌ఏ స్విమ్మింగ్ పూల్‌లో రాష్ట్రస్థాయి ఆక్వాటిక్ ఛాంపియన్‌షిప్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఇందు లో కడపకు చెందిన త్రిభువన్ రెడ్డి గ్రూప్-3 విభాగంలో సత్తా చాటాడు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగం, 50 మీటర్లు, 100 మీటర్ల బట్టర్‌ఫ్లై విభాగంలో సైతం పాల్గొని ఐదుకు ఐదు బంగారు పతకాలు సాధించాడు. వ్యక్తిగత విభాగంలో సైతం రాణించి సత్తా చాటాడు. దీంతో ఆగస్టు 6 నుంచి 11వ తేదీ వరకూ భువనేశ్వర్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలో పాల్గొనే అవకాశం దక్కినట్లు కోచ్‌లు సతీష్‌కుమార్, రాజేంద్ర, యోగేశ్వరరెడ్డి, ధనుం జయరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, స్పోర్ట్స్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ కె. జనార్థన్‌రెడ్డి తెలిపారు.

పిండ మార్పిడి విధానంతో జెర్సీ ఆవుకు ఒంగోలు దూడ జననం



రైల్వేకోడూరు, జూలై 17: పిండ మార్పి విధానంతో జెర్సీ ఆవుకు మంగళవారం రాత్రి ఒంగోలు దూడ జన్మనిచ్చింది. రాష్ట్రీయ గోకు ల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహిం చిన ఈ ప్రయోగం విజయవంతం అయింది. బుధవారం శెట్టిగుంట పశువైద్యులు ప్రతాప్ అందించిన వివరాల మేరకు.... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పిండ మార్పిడి విధానంతో రైల్వేకోడూరు మండలంలోని శెట్టిగుంట పశువై ద్యశాల పరిధిలోని జ్యోతి కాలనీకి చెందిన కుళాయి లక్ష్మీదేవి అనే పాడి రైతుకు చెందిన జెర్సీ ఆవుకు పిండ మార్పిడిలో భాగంగా ఒంగోలు జాతి పిండాన్ని 2023 సంవత్సరం సెప్టెంబరు 29న ప్రవేశ పెట్టడం జరిగింది. గత డిసెంబర్‌లో ఆవు చూలాల నిర్ధారణ చేశారు. అత్యంత ఒంగోలు జాతి కోడెదూడను జెర్సీ ఆవు జన్మనిచ్చింది. పిండ మార్పిడి విధానంలో గుంటూ రుకు చెందిన లామ్‌ఫామ్ డాక్టర్ ముత్తారావు, రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ అదనపు సీఈవో డాక్టర్ రజనీకుమారి, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ శ్రీకాంత్, కడప జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డాక్టర్ రమేష్, వీఏఎస్ డాక్టర్ శివరామిరెడ్డి ముఖ్య పాత్ర పోషించారన్నారు. పిండ మార్పిడి విధానం ద్వారా అత్యంత ఉత్తమ జెన్యు లక్షణాలు కల్గి ఉన్న పశువులను త్వరితగతిన అభివృద్ధి చేయడానికి ఉపయోగపడుతుందన్నారు.

అన్నమాచార్య కళాశాలలో వందశాతం సీట్ల భర్తీ

సికెదిన్నె, జూలై 17: కడప అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో వంద శాతం సీట్ల భర్తీ అయినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుధాకర్‌రెడ్డితెలిపారు. ఏపీఈఏపీసెట్ సీ ట్ల కేటాయింపులో బుధవారం విడుదల చే సిన లిస్టులో కడప అన్నమాచార్య ఇంజనీ రింగ్ కళాశాల వంద శాతం సీట్లు భర్తీ కా వడం పట్ల విద్యాసంస్థల అధినేత గంగిరెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. తమ విద్యాసంస్థల మీద ఎంతో నమ్మకంతో కళాశాలలోని కంప్యూటర్ సైన్స్, సీఎస్ఈ, ఇంటలిజెన్స్, లెనన్ లర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, డేటా సైన్స్, ఎలక్ట్రానిక్ కమ్యూ నికేషన్స్‌లో వంద శాతం సీట్లు భర్తీ కావ డంపట్ల ఆనందం వ్యక్తం చేశారు. తమ క ళాశాలలో సీట్లు వచ్చిన ప్రతి విద్యార్థి ఈనె ల 22 తేదీలోపు రిపోర్టు చేయాలని.. మరి న్ని వివరాలకు 9603999591, 7386324079 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ భూమికి ఎసరు

● అక్రమంగా వెలసిన గుడిసెలు ● రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ఘర్షణకు దారితీసిన వైనం


అక్రమంగా వేసిన గుడిసెలను తొలగిస్తున్న అధికారులు


గుడిసెలు తొలగించే సమయంలో ఘర్షణ పడుతున్న ఇరువర్గాలు

బద్వేలు, జూలై 17: బద్వేలులో భూ వివాదాలకు అడ్డుకట్ట పడడం లేదు. కబ్జారాయుళ్లు ఒకవైపు పేదల పేరుతో మరోవైపు ప్రభుత్వ స్థ లాలకు ఎసరు పెడుతూనే ఉన్నారు. రెవెన్యూ అధికారులు కబ్జాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారా... చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నా రా.. కారణం ఏదైతేనేం ఆక్రమణదారులకు అడ్డూ అదుపులేకుండా పో తోంది. తాజాగా బద్వేలు పట్టణం సమీపంలోని గోపవరం మండలం లో వెలసిన గుడిసెల వివాదం ఘర్షణకు దారితీసింది. గుడిసెలను స్థానికులు, రెవెన్యూ అధికారులు, పోలీసులు తొలగించడంతో వివా దం మొదలైంది. దీంతో స్థానికులు మరియు స్థానికేతరుల మధ్య ఘ ర్షణ నెలకొంది. ఇక్కడి పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జో క్యం చేసుకోవాల్సి వచ్చింది.

10 రోజులుగా వెలసిన గుడిసెలు

గోపవరం మండలం 1623, 1624 సర్వే నెంబర్లలో గ్రేటర్ రాయలసీ మ ఫోరం ఆధ్వర్యంలో 10 రోజుల క్రితం గుడిసెలు వేశారు. రెవెన్యూ కార్యాలయం సమీపంలోనే అక్రమంగా గుడిసెలు వేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. బుధవారం స్థానికులు మా స్థలంలో గు డిసెలు ఎలా వేస్తారని, గుడిసెలు వేసిన వారితో ఘర్షణపడ్డారు. మా టమాటా పెరిగి కొట్టుకునే వరకు దారితీసింది. ఈ ఘర్షణలో కొంత మందికి గాయాలయ్యాయి. గుడిసెలు వేసిన వారిలో ఓ సామాజిక వర్గానికి చెందిన వారు ఉండడంతో స్థానిక జనసేన నాయకులు అక్క డికి వెళ్లారు. సామాజిక వర్గం పేరుతో కొందరు మాట్లాడడంతో మ రింత ముదిరి ఘర్షణ వాతావరణం నెలకొంది. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా బద్వేలు ప్రాంతంలో ఘర్షణలు చోటు చేసుకుం టున్నాయన్న ఆరోపణలు సర్వత్రా వినవస్తున్నాయి. లంచాలు తీసుకు ని ఎవరికంటే వారికి పట్టాలు మంజూరు చేయడం ఇష్టానుసారంగా ఆన్‌లైన్ ఎక్కించడంతోనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు పేర్కొం టున్నారు. మరి ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి బద్వేలు లో ఆక్రమణలకు అడ్డు వేయకపోతే ముందుకూడా ఇలాంటి గొడవ లు తప్పవని చెప్పవచ్చు.

దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గుడిసెలు తొలగించే సందర్భంగా మాపై దాడిచేసి గాయపరిచిన వా రిపై తక్షణమే కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల ని గుడిసెలు వేసిన బాధితులు బద్వేలు రూరల్ పోలీసుస్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఘర్షణపడిన ఇరువర్గాల వారిని పోలీసులు అ దుపులోకి తీసుకున్నారు.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు దగ్ధం



గోపవరం, జూలై 17: గోపవరం మండలం మడకలవారిపల్లె గ్రామ పొలం సర్వేనెంబర్ 1622, 1623 సర్వేనెంబర్‌లో ప్రభుత్వం భూమిలో రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేశారు. మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు గుడిసెలకు నిప్పంటించారు. ఇది తెలుసుకున్న రైతు సంఘాల నాయకులు శ్రీనివాసపురం గ్రామ స్తులు దాడి చేశారని చర్చించుకుంటుండగా... అది తెలిసిన గ్రామ స్తులు వారితో వాగ్వాదానికి దిగారు. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరగగా ఒకరిపై ఒకరు రాళ్ళతో దాడి చేసుకున్నారు. మా గ్రామస్తుల స్థలాల్లో మీరు గుడిసెలు ఎలా వేస్తారని ఘర్షణ జరిగింది. ఇది తెలుసుకున్న పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల వారిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కి తరలించారు.

వేడుకగా తొలి ఏకాదశి

వైష్ణవాలయాల్లో మార్మోగిన గోవిందనామాలు ● పోటెత్తిన భక్తులు





పుష్పగిరిలో కొలువైన చెన్నకేశవస్వామి - చెన్నూరులో ప్రసన్న వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారం - పులివెందుల పద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పులివెందుల రూరల్, జూలై 17: శ్రీ మహా విష్ణువు తొలి ఏకాదశితో నిద్రకు ఉపక్రమిస్తారని కనుక దీన్ని శయన ఏకాదశి అని కూడా అంటారు. తర్వాత చాతుర్మాస దీక్ష ప్రారంభం అవుతుంది. ఆషాఢమాస ఏకాదశితో మొదలై కార్తీకమాస ఏకాదశితో చాతుర్మాస దీక్ష ముగుస్తుంది. దీంతో వైష్ణవాలయాల్లో గోవింద నామాలు స్మరిస్తూ భక్తులు పోటెత్తారు. వివరాల్లోకెళితే....

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా వైష్ణవ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని శ్రీరంగనాథస్వామి ఆలయం, శ్రీపద్మావతి సమేత కల్యాణ వేంకటరమణస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అర్చకులు స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయాలు గోవింద నామస్మరణలతో మార్మోగాయి. ఇళ్లలో తొలిఏకాదశి పూజలు నిర్వహించుకున్నారు.

సింహాద్రిపురం మండలంలో....

సింహాద్రిపురం, జూలై 17: హిందువుల తొలి పండుగగా పిలువబడే తొలిఏకాదశి పర్వదినాన్ని మండలంలో బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు ఆలయాలకు వేకువ జామునే చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిచారు. హైందవ సంస్కృతిలో తొలి ఏకాదశికి విశేష స్థానం కలదని, ఆలయాల్లో ప్రధాన అర్చకులు తొలి ఏకాదశి పర్వదినం విశిష్ఠతను భక్తులకు వివరించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాముఖ్యత కలిగిన తొలి ఏకాదశి

సికెదిన్నె, జూలై 17: హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత కలిగిన పండుగ తొలి ఏకాదశి. తెలుగు సంవత్సరంలో మొదట వచ్చే పండుగ తొలి ఏకాదశి కావడంతో భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. మండలంలో తొలి ఏకాదశి పండుగను ప్రజలు ఘనంగా చేసుకున్నారు. తొలి ఏకాదశి పండుగ సందర్భంగా ఆలయాల్లో అందంగా ముస్తాబు చేసి భక్తులు వివిధ ఆలయాల్లో ఘనంగా పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి తర్వాతే పండుగలన్నీ మొదలవుతాయని, అర్చకులు తొలి ఏకాదశి ప్రాముఖ్యతను భక్తులకు వివరించారు.

ఘనంగా పుణ్య ఏకాదశి పూజలు

చెన్నూరు జులై 17: మండలంలోని వైష్ణవాలయాల్లో తొలి ఏకాదశి పూజలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జామునే చెన్నూరు ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూల విరాట్టుకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకారాలు, నిర్వహించి భక్తులకు దర్శనం గావించారు. ఆలయ మండపంలో వేంకటేశ్వర సహస్రనామస్తోత్రం, చేశారు. సీతారామాలయాలన్నింటిలో ఏకాదశి పూజలు జరిగాయి.

పుష్పగిరిలో ఘనంగా వేడుకలు

వల్లూరు, జూలై 17: ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పుష్పగిరి కొండమీద లక్ష్మీసమేత చెన్నకేశవులస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామున స్వామి వారికి విశేషంగా అభిషేకాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. పండుగ సందర్భంగా భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మతసామరస్యానికి ప్రతీక మొహర్రం





వల్లూరు మండలం పెద్దపుత్ర, చెన్నూరు మండలం కొండ పేట, పెండ్లిమర్రి మండలం వెల్లటూరులో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

కడప (కల్చరల్) జులై 17: మతసామరస్యానికి ప్రతీకగా మొహర్రం పండుగ నిలుస్తోంది. మొహర్రం పురస్కరించుకుని నగరంలోని ఏ.ఆర్. నగర్‌లో వెలసిన పీర్ల మకాన్‌లో ప్రత్యేకంగా పీర్ల చావిడి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సయ్యద్ సలావుద్దీన్, పీర్ల చావిడి నిర్వాహకులు మహబూబ్‌బాషా, కమిటీ సభ్యులు, పలువురు హిందూ, ముస్లిం సభ్యులు పాల్గొన్నారు.

వల్లూరులో గ్రామోత్సవం

వల్లూరు, జూలై 17: మొహర్రం సందర్భంగా మండల పరిధిలోని పెత్తపుత్ర, తప్పెట్ల గ్రామాల్లో పీర్లచావిడి వద్ద పీర్లను ఏర్పాటు చేశారు. హిందు, ముస్లింలు ఐక్యమత్యంగా ఈ పండుగను నిర్వహించుకుంటారు. పెద్దపుత్రలో పీర్లను ఏర్పాట్లు చేసి బుధవారం గ్రామోత్సవం చేపట్టారు. ప్రజలు చదివింపులు చేశారు.

కొండపేటలో....

చెన్నూరు జూలై 17: కొండపేటలో పీర్ల పండుగ ప్రజల ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. మూడు రోజుల కిందట గ్రామ చావిడిలో పీర్లను నిలిపి పూజలు నిర్వహిం చిన గ్రామస్థులు మంగళవారం రాత్రి గుండం తొక్కడం, బుధవారం సాయంత్రం గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో హిందూ, ముస్లిం దూదేకులు సైతం కలిసి ఆనందోత్సాహాలతో రంగులు చల్లుకుంటూ మంగళవాయిద్యాలు వాయిస్తూ సతోషంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు నేతలు ఆర్. సుధాకర్‌రెడ్డి, మాజీ సర్పంచులు బాసు, మోహన్‌రెడ్డి, ఖాసీంపీరా, గౌస్‌లాజం, సాగర్, నన్నేసాబ్, సుబాన్‌బాష హనీఫ్, కొండ పేట బాష, టీడీపీ మండల కన్వీనర్ విజయ్‌బాస్కర్‌రెడ్డి సబ్బీర్‌హుస్సేన్ శివారెడ్డి జగన్, తదితరులు పాలొన్నారు.

కులమతాలకు అతీతంగా...

కమలాపురం రూరల్, జూలై 17: గంగవరం, విభరాపురం గ్రామాల్లో వెలసిన దర్గా ఆవరణలో పీర్ల పండుగను ఘనంగా నిర్వహించారు. ముందుగా దర్గా ఆవరణలో వెలసిన పీర్లకు ప్రత్యేక పూజలు చేసి స్వామి వార్లను ఎత్తుకున్న భక్తుడు అగ్ని గుండంలో దిగి అక్కడి నుంచి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో ప్రజలు స్వామి వారికి చెక్కర సదివింపులు చేశారు. స్వామి వారికి గొడుగులు, పూలహారాలు, చెక్కర సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో విభరాపురం, గంగవరం ప్రజలు మద్దూరు శ్రీను, బీసీ నేత గోపాల్ యాదవ్, సుబ్బరాయుడు, కాశి, దస్తగిరి, జిలాని, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

పెండ్లిమర్రి, జూలై 17: మండలంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. పెండ్లిమర్రి, వెల్లటూరు గ్రామాల్లో మొహర్రం వేడులను ప్రజలు కులమతాలకు అతీతంగా ఘనంగా చేసుకున్నారు. పీర్లచావిడి వద్ద హిందువులు, ముస్లింలు కలిసి పీర్లను ఏర్పాటుచేసి పీర్లకు చదివింపులు చేశారు. అనంతరం పీర్లకు ఎదురుగా గుండం ఏర్పాటు చేసి గుండం ప్రవేశం చేశారు. సాయంత్రం బాణసంచా, డప్పు వాయిద్యాల మధ్యపీర్లను ఊరేగించారు.

సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలి

జనసేన నేత తుంగా రమణయ్య పిలుపు



విలేకరులతో మాట్లాడుతున్న తుంగా రమణయ్య

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17: శంకరాపురం అంజనేయస్వామి గుడి వద్ద గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని జనసేన నేత తుంగా రమణయ్య పిలుపునిచ్చారు. కడప నగరం విశ్వప్రగతి చిట్‌ఫండ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జనసేన ఆవిర్భావం తరువాత లక్ష మందికి పైగా అభిమానులు జనసైనికులు పార్టీ అధినేత పవన్‌కల్యాణ్‌కు తోడు నిలబడి పార్టీ అధికారంలోకి రావడానికి ప్రధాన కారణమయ్యారన్నారు. అదే స్ఫూర్తితో భవిష్యత్‌లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సభ్యత్వ నమోదు చేపట్టామన్నారు. సభ్యత్వం తీసుకున్న వీర మహిళలకు రూ 5 లక్షలు ఇన్సూరెన్స్ రూ 50 వేలు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభ్యత్వానికి సంబంధించి ఒక్కొక్కరు రూ.500, ఒక పాస్‌ఫొటో, ఆధార్ కార్డు, నామిని ఆధార్‌కార్డు తీసుకురావాలన్నారు. వివరాలకు 8885041666 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పంద్రా రంజిత్‌కుమార్, గజ్జెల సాయి, అబ్బన్నగారి రాజగోపాల్, తిరుమలశెట్టి సిద్దు, తుంగా కిరణ్, రెడ్డిపల్లె మహేష్ బాబు, ఏనుగుల సాయినాథ్, కల్వ హరిశంకర్ సాయి, తుంగా మధు, గాజుల ప్రసాద్, గౌస్‌బాషా, మదినేను అంజి, తుంగా శ్రీను, లకిడి రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించండి

ఎస్పీని కలిసి సత్కరించిన సలావుద్దీన్



ఎస్పీని కలిసి సత్కరిస్తున్న సలావుద్దీన్

కడప (మారుతీనగర్) జూలై 17: మతసామరస్యానికి ప్రతీకగా ఖ్యాతిగాంచిన కడప జిల్లాలో శాంతి భద్రతలను పరిరక్షించి ప్రజల మన్ననలను అందుకోవాలని సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్ ఆకాంక్షించారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన హర్షవర్ధన్ రాజును బుధవారం ఆయన ఛాంబర్‌లో కలిసి శాలువా, పూల బొకేతో సత్కరించారు. యువత మితిమీరిన వేగంతో ద్విచక్రవాహనాలను నడపడం వలన ఇతర వాహన, పాదచారులకు ఇబ్బందికరంగా వుందన్నారు. బాల,బాలికలు ద్విచక్రవాహనాలతో రోడ్లపైకి వస్తూ, సెల్‌ఫోన్‌లలో మాట్లాడడం ఎక్కువైందన్నారు. తగురీతిగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్దార్, హఫీజ్, షాబుద్దీన్, జావిద్, తదితరులు పాల్గొన్నారు.

9వ సారి తిరుమలకు పాదయాత్ర



తిరుమలకు పాదయాత్రగా వెళుతున్న భక్తులు

కమలాపురం రూరల్, జూలై 17: పెద్ద చెప్పలి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల నుంచి వేంకటేశ్వరస్వామి భక్తులు 9వ సారి తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. ఏటా ఏకాదశి రోజున తిరుమలకు పాదయాత్రగా వెళ్లి వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటారు. అందులో భాగంగా మంగళవారం ఉదయం దాదాపు 250 మంది వేంకటేశ్వరస్వామి భక్తులు స్వామి మాల ధరించి తిరుమలకు పాదయాత్రగా వెళ్లారు. వీరంతా అన్నమయ్య కాలిబాట ద్వారా ఆదివారానికి తిరుమల చేరుకుంటారు. ఆదివారం స్వామి వారిని దర్శనం చేసుకుని తిరిగి వస్తారని తెలిపారు. పాదయాత్రకు బయలుదేరిన వారందరికీ దాతల సహకారంతో అన్నదానం ఏర్పాట్లు చేశారు.

మాజీ సర్పంచు మృతి

పెండ్లిమర్రి, జూలై 17: మాచునూరు పంచాయతీ మాజీ సర్పంచు, మండల వైసీపీ కన్వీనర్ మాచనూరు చంద్రారెడ్డి (76) అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈయన స్వగ్రామంలో మృతదేహానికి మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాష, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి తదితరులు నివాళులర్పించారు.

103 బస్తాల చౌకబియ్యం పట్టివేత

చెన్నూరు జూలై 17: స్థానిక రాజులకాలనీ సమీపంలో ఓ గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 103 బస్తాల చౌక బియ్యం సీఐ నారాయణ యాదవ్ బుధవారం స్వాధీనం చేసుకున్నారు అందిన సమాచారం మేరకు అక్రమంగా రవాణాకు సిద్ధం చేసిన బియ్యం బస్తాలను నిల్వ ఉంచారని తెలియడంతో దాడి చేసి చెన్నూరు వాసి బ్రహ్మయ్యపై కేసు నమోదు చేశామన్నారు. పంచనామా నిర్వహించి బియ్యం బస్తాలను రెవెన్యూ సిబ్బందికి అప్పగించామన్నారు. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సత్కారం

కడప (మారుతీనగర్) జూలై 17: అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా మౌలానా ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం సొసైటీ కార్యాలయంలో సీనియర్ న్యాయవాదులు డాక్టర్ జాల ప్రభాకర్, అక్బర్ అలీఖాన్‌ను సత్కరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీ.సీ. సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందునాగరాజు హాజరై మాట్లాడారు. న్యాయవాది వృత్తి ఎంతో పవిత్రమైనదని, అలాంటి వృత్తిలో సేవలందించడం చాలా అదృష్టంగా భావించి న్యాయం కోసం వచ్చే పేదలకు సరైన న్యాయం జరిగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆ సొసైటీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ షబ్బీర్ సభ్యులు సద్దిక్ అలీ అహ్మద్, ఓబయ్య పాల్గొన్నారు.

మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి



విలేకరులతో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నేత శివశంకర్

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17: వసతి గృహాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కె. శివశంకర్ డిమాండ్ చేశారు. కడప నగరం హోచిమిన్ భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల వసతి గృహాల్లో సరైన వసతులు లేవన్నారు. వర్షాకాలం కారణంగా అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని తక్షణం మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అకిరా నందన్, మస్తాన్, నికిల్, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల నియామకం

కడప ఎర్రముక్కపల్లె, జూలై 17: ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా కె. ఈశ్వరచంద్రరావు, ఏఎంఎం అలీఖాన్ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. బుధవారం ఏపీటీఎఫ్ అమరావతి కార్యాలయంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షులుగా చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు కార్యదర్శిగా వీర ప్రసాద్, కోశాధికారిగా సాయి ప్రతాప్, ఉపాధ్యక్షుడిగా రాజగోపాల్, కార్యదర్శిగా ఎ. పద్మజ, రాష్ట్ర కౌన్సిలర్‌గా సివి ప్రసాద్‌ను ఎంపిక చేశారు. వీరు 2024 నుంచి 2026 వరకు కొనసాగుతారు.

మంత్రి లోకేష్‌ను కలిసిన పులివెందుల టీడీపీ నేతలు

సింహాద్రిపురం, జూలై 17: ఐటీ మంత్రి నారా లోకేష్‌ను పులివెందుల టీడీపీ నేతలు వెలగపూడి సెక్రటేరియేట్‌లోని తన ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో పెట్టుబడులు తీసుకొచ్చి ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని వారు నారా లోకేష్‌ను కోరినట్లు తెలిపారు. లోకేష్ సానుకూలంగా స్పందించి పులివెందుల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు టీడీపీ నేతలు తెలిపారు. తెలుగు యువత స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి అజ్జగుట్టు రవితేజారెడ్డి, టీడీపీ నేత పుష్పాల వర్ధన్‌రెడ్డి(పీవీఆర్) తదితరులున్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



నిత్యావసరాలు అందిస్తున్న డాక్టర్ నవీన్, డాక్టర్ శరణ్య

పులివెందుల రూరల్, జూలై 17: పట్టణంలోని పలువురు దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బుధవారం డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ శరణ్య దంపతుల కుమార్తె సాయి నవీషా పుట్టిన రోజు సందర్భంగా 30 మందికి నిత్యావసర సరుకులు అందించినట్లు వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. విందులు, వినోదాలకు ఖర్చు చేయకుండా దివ్యాంగులకు సాయం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు డాక్టర్ కొండయ్య, రమాదేవి, రామకృష్ణారెడ్డి, లక్ష్మీకాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కడప నగరంలోని పలు స్టేషన్‌ల తనిఖీ

కడప క్రైం జూలై 17: కడప నగరంలోని పలు స్టేషన్‌లను బుధవారం సాయంత్రం ఎస్పీ హర్షవర్ధన్ రాజు తనిఖీ చేశారు. వన్ టౌన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలించి రికార్డులను చూశారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వీడియో వాల్‌ను, ఎల్‌హెచ్‌ఎంఎస్, డయల్ 100,112, కాల్స్‌ను పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరును సీఐ వెంకటేశ్వర్లును అడిగి తెలుసుకున్నారు. మహిళా పోలీసు స్టేషన్, టూటౌన్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. బహిరంగా ప్రదేశాల్లో అల్లరిగా తిరుగుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. చోరీల నియంత్రణకు నిఘా ఉంచాలని సూచించారు. మహిళా పీఎస్ డీఎస్పీ రమాకాంత్, సీఐలు భాస్కర్ రెడ్డి, ఇబ్రహీం, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నమాట ప్రకారం హామీల అమలు



విలేఖరులతో మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి

చెన్నూరు జూలై 17: అన్నమాట ప్రకారంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీలను అమలు చేస్తున్నారని మండల కన్వీనర్ కె. విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. చెన్నూరు టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ రద్దు, ఆగస్టు 15 నుంచి అన్నక్యాంటీన్లు ప్రారంభం, జనవరికి మెగా డీఎస్సీ, పెంచిన పెన్షన్లు పెంపు అమలు చేశారన్నారు. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి ఒక మాట చెప్పి దాన్ని నిలబెట్టుకునేందుకు నెలలు, ఏళ్లు గడిపారన్నారు. ప్రస్తుతం ఆ దుస్థితి లేదన్నారు. చెన్నూరు మండలానికి అభివృద్ధి పరంగా ఏమి చేయాలో అందుకు తగ్గ ప్రణాళికను ఎంఎల్‌ఏ పుత్తా చైతన్యరెడ్డి సారథ్యంలో తయారు చేస్తున్నామన్నారు. రోడ్లు, ఇంటింటికీ తాగునీరు, నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. ఐదేళ్లలో మండలాన్ని ఆదర్శమండలంగా తీర్చిదిద్దుతామన్నారు కార్యక్రమంలో జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుస్సేన్, క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జన్న బీసీ సెల్ అధికార ప్రతినిధి సుబ్రమణ్యం , ఏటీడీపీ మణింకర, బలిజ సంఘం నేత అతికారి కిశోర్, తదితరులు పాలొన్నారు.

విజయసాయిరెడ్డి క్షమాపణ చెప్పకుంటే ఉద్యమం ఉధృతం

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నేత పి. రామసుబ్బారెడ్డి



అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేస్తున్న మీడియా ప్రతినిధులు

కడప ఎర్రముక్కపల్లి, జూలై 17: రాజ్యసభ సభ్యుడు వైసీపీ నేత విజయసాయిరెడ్డి మీడియాకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నేత పి. రామసుబ్బారెడ్డి హెచ్చరించారు. కడప నగరం అంబేడ్కర్ సర్కిల్‌లో మీడియాపై ఆయన చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ప్రెస్‌క్లబ్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టి విజయసాయిరెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యసభ సభ్యుడు అని కూడా లేకుండా దిగజారి మీడియాపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. నాలుగు చానళ్ళు మాత్రమే కరెక్టుగా ఉన్నాయని మిగితావన్నీ అమ్ముడు పోయాయని చెప్పడం విజయసాయిరెడ్డి దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. మీడియా ఎప్పుడూ తమ పరిధిలో పనిచేస్తుంటాయని ఆయన గుర్తు చేశారు. భ్రష్టు పట్టడానికి విజయసాయిరెడ్డి లాంటి నేతలే కారణమని తెలిపారు. వారికి అనుకూలంగా మాట్లాడితే మంచి మీడియా అని, ప్రతికూలంగా మాట్లాడితే వాటిపై దుమ్మెత్తిపోయడం నేటి కాలంలో పరిపాటిగా మారిందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పునరాలోచన చేసి ఇటువంటి నేతలను పార్టీ నుంచి బహిష్కరించాలన్నారు. విజయసాయిరెడ్డి పత్రికా రంగానికి క్షమాపణ చెప్పాలని దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు శ్రీనివాసులు, రామాంజులరెడ్డి, ఎక్కంటి అంజనే యులు, శ్యామ్, శివ, రామచంద్ర, సుధీర్, కిశోర్ కుమార్, వేణు, మధు, కృష్ణామూర్తీ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరాంపల్లెలో వైద్య బృందం పర్యటన

ఇంటింటి సర్వే చేశాం : డిప్యూటీ డీఎంహెచ్ఓ

వేంపల్లె, జూలై 17: కుమ్మరాంపల్లె ఎస్టీ కాలనీని డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొయినుద్దీన్ ఆధ్వర్యంలో వైద్య బృందం పర్యటించింది. ఆ కాలనీలో అతిసారతో ఒకే కుటుంబం బాధపడుతోందని ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమవడంతో స్పందించిన వైద్యఆరోగ్య శాఖ అధికారులు డిప్యూటీ డీఎంహెచ్ఓ ఖాజామొయినుద్దీన్, వైద్యాధికారి లక్ష్మీప్రియ, సూపర్ వైజర్ వెంకటలక్షుమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ బాబాఫక్రుద్దీన్, సీహెచ్ఓ ఫరూక్, ఏఎన్ ఎం వీర నాగమ్మ తదితరులు ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. కాలనీలో ఒక్క కుటుంబంలో ఫుడ్‌పాయిజనింగ్ జరగడంతో వాంతులు, విరేచనాలు కావడం, అవి మిగతా కుటుంబ సభ్యులకు వచ్చిందని డిప్యూటీ డీఎంహెచ్ఓ తెలిపారు. చికిత్స చేయించుకున్నారని, ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు. ఎక్కడైనా జ్వరం, అతిసారకు గురైనట్లు తెలిసిన వెంటనే వైద్యసిబ్బంది గ్రామాలకు వెళ్తున్నారని తెలిపారు. ప్రజలంతా ఆరోగ్యంపై జాగ్రత్త వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

టైపు పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 17: మాన్యువల్ టైప్ రైటింగ్ పరీక్షలను స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెప్టెంబరు 28, 29 తేదీల్లో నిర్వహిస్తోందని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీటైప్‌రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇనిస్టిట్యూట్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 28, 29 తేదీల్లో తెలుగు, ఇంగ్లీషు లోయర్, హైయ్యర్ పరీక్షలను, హైస్పీడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. అలాగే సెప్టెంబరు 21, 22 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా 6 పరీక్షా కేంద్రాల్లో తెలుగు, ఇంగ్లీషు షార్ట్‌హ్యాండ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు.



జాహిర్	-	కడప
చాంద్	-	ప్రొద్దుటూర్
వర్మల	-	పెనుకొండ
శ్రీరామ	-	నంద్యాల
రఘురామ	-	నంద్యాల
వెంకటేశ్వర	-	మైదుకూరు
రాధాకృష్ణ	-	మార్కాపురం
భారత్ కాంప్లెక్స్	-	కర్నూలు

CONTACT: 9573783799



వైభవంగా మొహర్రం వేడుకలు



ముద్దనూరు, జమ్మలమడుగులో ఏటికి తరలుతున్న పీర్లు, పోరుమామిళ్లలో ఊరేగింపుగా వెలుతున్న పీర్లు

ముద్దనూరు జూలై17: ముద్దనూరులో మొహర్రం వేడుకలు వైభవంగా జరిగాయి. బుధవారం సాయంత్రం పీర్లను ఏటికి తరలించారు. అందులో భాగంగా భక్తులు పీర్లను ఎత్తుకొని మధ్యాహ్నం గుండంలో దిగారు. అనంతరం పీర్లను పురవీధుల గుండా ఊరేగింపుగా ఏటికి తరలించారు. కుల, మతాలకు అతీతంగా అడుగడుగునా స్వాములకు భక్తులు నీళ్ల పోస్తూ, చదివింపులు సమర్పించారు. పీర్లు ఏటికి వెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగిశాయి. అవాంచనీయ సంఘటనలు జరుగకుండా సీఐ దస్తగిరి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కొండాపురం..: మండలంలో మొహర్రం వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి.మండలంలోని కొండాపురం, చౌటిపల్లె తదితర గ్రామాలలో పీర్లను ఊరేగించారు.డప్పు వాయిద్యాలతో పీర్లను ఊరేగిస్తూ ఏటికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.అదేవిధంగా మండలం నుంచి గూగూడు కుళ్లాయిస్వామి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో భక్తులు మొహర్రం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పది రోజుల నుంచి ఆయా ప్రాంతాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకుని పీర్లను కొలువుదీర్చారు. అందులో భాగంగా పట్టణంలోని మెయిన్ పోస్టాఫీసు ఎదురుగా, గూడుమస్తాన్‌వలి దర్గా సమీపాన, కోట వీధిలోని మసీదు పక్కన పీర్లను కొలువుదీర్చారు. అలాగే మండలంలోని పి.సుగుమంచిపల్లె, పెద్దదండ్లూరు, తదితర గ్రామాల్లో మొహర్రం పండుగను జరుపుకున్నారు. అందులో భాగంగా బుధవారం సాయంత్రం భక్తులు రంగులు చల్లుకున్నారు. భక్తిశ్రద్ధలతో పీర్లను ఏటికి సాగనంపి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. అనంతరం ప్రసాద వినిమయం చేశారు.

ప్రొద్దుటూరు టౌన్..: మొహర్రం పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాల్లో కొలువుదీర్చిన పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సుందరాచార్యుల వీధిలోని పీర్లచావిడిలో కొలువుతీర్చిన పీర్లకు పూజలు నిర్వహించారు. నడింపల్లెలో పీర్లకు పూజలు నిర్వహించి డప్పువాయిద్యాల మధ్య ఊరేగింపు నిర్వహించారు. భక్తులు పీర్లను సందర్శించి చక్కెర చదివింపులు చేశారు.

కాశినాయన..: నర్సాపురంలో మొహర్రం పండుగ బుధవారం నుంచి ప్రారంభమైంది. ఈసందర్భంగా అందంగా అలంకరించిన పెద్దపీరయ్య, చిన్నపీరయ్య తదితర స్వాములను గ్రామంలో ఊరేగింపుగా తీసుకపోయారు. పలువురు భక్తులు ఉత్సాహంగా ఈగ్రామోత్సవంలో పాల్గొన్నారు. పండుగలో భాగంగా గురువారం చిన్న సర్గీసు పండుగను నిర్వహించనున్నామన్నారు.

పోరుమామిళ్ళ..: మొహర్రం సందర్భంగా బుధవారం పోరుమామిళ్ళ మండలంలో టేకూరుపేట, పోరుమిమిళ్ళలోని హుసేన్ పీర్ దర్గా వద్ద ఉన్న పీర్ల చావిడిలోని పీర్లు, ఉద్దిగడ వీధిలోని పీర్లు, ముస్లిమ్ కోట వీధిలోని పీర్లు, గుమ్మటాలను అంగరంగ వైభవంగా ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం గుండాలలో నిప్పు రవ్వల పై నడిచి భక్తిని చాటుకున్నారు. సాయంత్రం ఈ మెత్తం పీర్లు, గుమ్మటాలు అమ్మవారిశాల వీధిలో ఏకమై ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నాయి. సీఐ చిరంజీవి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నారు.



కాశినాయన..నర్సాపురంలో ఊరేగుతున్న పీర్లు



రాజుపాలెం.. టంగుటూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం



ప్రొద్దుటూరులో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం

శాకాంబరీగా రాజరాజేశ్వరీదేవి



ప్రొద్దుటూరు టౌన్, జూలై 17: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో రాజరాజేశ్వరిదేవి అమ్మవారిని శాకాంబరిదేవిగా అలంకరించారు. బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారు, అమ్మవార్లకు రుద్రాభిషేకం, కుంకుమార్చన, పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. రాజరాజేశ్వరీదేవి అమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలతో శాకాంబరిదేవిగా అలంకరించారు. పావణి బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన భక్తిగీతాలాపన భక్తులను ఆకట్టుకుంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

జీపీఎస్ వద్దు ఓపీఎస్ కావాలి

పోరుమామిళ్ళ, జూలై 17 : జీపీఎస్ వద్దు, ఓపీఎస్ కావాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి అన్నారు. బుధవారం ఏపీటీఎఫ్ 257 రీజినల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింప చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్ వెంటనే ప్రకటించాలన్నారు. పాఠశాలకు విద్యుత్ బకాయిలను ప్రభుత్వమే భరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర కార్యదర్శులు ఎస్ఎ సత్తార్, భాస్కర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అవినీతిపై ఫిర్యాదు చేస్తాం'

బి. కోడూరు, జూలై 17: మండల పరిధిలోని విద్యుత్ అధికారుల అవినీతిపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేస్తామని మండల టీడీపీ అధ్యక్షులు రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు రమణారెడ్డి, పేర్కొన్నారు. బి. కోడూరులో బుధవారం, ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కబ్జాదారులు పొలాల్లో రాత్రికి రాత్రికి వేసిన బోర్లకు మరుసటిరోజే ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తున్నారని అధికారులపై విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేసి విచారణ కోరతామని తెలిపారు. నాయకులు గోడి రమణారెడ్డి, బాస్కర్‌రెడ్డి, జయరామిరెడ్డి, రామ్‌మోహన్ రెడ్డి, రాఘవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై అధికారుల చర్యలు

జమ్మలమడుగు, జూలై 17: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో పలు వీధుల్లో అక్రమ లేఅవుట్లపై బుధవారం మున్సిపల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గత ఏడాది క్రితం ప్రొద్దుటూరు రోడ్డులోని ప్రధాన రోడ్డుకు పక్కన అలాగే దిగువపట్నం కాలనీ శివార్లలో మొత్తం ఆరు చోట్ల దాడులు చేశారు. అక్రమ లేఅవుట్లలో పాతిన నంబరు రాళ్లను తొలగించారు. కొన్ని చోట్ల రాళ్లను పగులకొట్టారు. అక్రమ లేఅవుట్లపై పార్టీలకతీతంగా వ్యాపారస్థులపై మున్సిపల్ అధికారులు దాడులు చేసి చర్యలు తీసుకుంటే మున్సిపాలిటీకి మరింత ఆదాయం వస్తుందని పలువురు తెలిపారు. అయితే జమ్మలమడుగు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేసి స్థలాలు విక్రయించారని అలాంటివారందరిపై విచారించి అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా బుధవారం ఉదయం నుంచి సాయంత్రం దాకా పట్టణంలోని ఆరు చోట్ల అక్రమ లేఅవుట్లు పాతిన రాళ్లను తొలగించామని, ఇందుకు సంబంధించి అందులో రిజిస్టరు అయి ఉండి ఏదైనా సమస్యలు ఉంటే యజమానులు తిరిగి అనుమతులు పొందాలని ఆయన తెలిపారు.



అక్రమ లేఅవుట్లలో తొలగించిన రాళ్లు

డీఈవో పూల్‌లో వున్న భాషోపాధ్యాయులను ఉన్నతీకరించాలి

ప్రొద్దుటూరు , జూలై 17 : డీఈవో పూల్‌లో వున్న తెలుగు ,హిందీ, ఉర్దూ భాషోపాధ్యాయులకు కేడర్ పోస్టు రద్దు కావడంతో నాలుగేళ్ళుగా సరైన ఖాళీలు కేటాయించబడక ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని వీరికి న్యాయం చేయాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం గౌరవ అధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక శ్రీరాముల పేటలోని ఉపాధ్యాయ సేవాకేంద్రంలో ఆయన భాషోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం అధ్యక్షుడు అంకాల్ కొండయ్య, కోశాధికారి బోగా గంగాధర్, ఉపాధ్యక్షుడు సాయికుమార్, ఉర్దూ పండితులు రోషన్, కుర్దూస్, ఇక్బాల్ ఖాన్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు కృషి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 17: కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని ఆమ్‌ఆద్మీ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీజాదస్తగీర్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, కడప స్టీల్‌ప్లాంట్‌పై సైకిల్‌పై ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకుని నాలుగు రోజులుగా పట్టణంలో ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే కొత్తగా అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం కడప ఉక్కు, ప్రత్యేక హోదా సాధనకోసం కృషి చేయాలని కోరారు.

ఎట్టకేలకు పారిశుధ్య కార్యక్రమాలు



అయ్యవారుపల్లెలో బ్లీచింగ్‌పౌడర్ చల్లుతున్న దృశ్యం

రాజుపాళెం, జూలై 17: ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఈ సమస్యకు పరిష్కారం లేదా..?' అనే వార్త బుధవారం ప్రచురితమవడంతో సంబంధిత అధికారులు ఎట్టకేలకు స్పందించారు. కాగా రాజుపాళెం అయ్యవారుపల్లె, టంగుటూరు గ్రామాల్లో మురుగును తొలగించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు ఈఓపీఆర్డీ షాకీర్‌అలీఖాన్ తెలిపారు. గ్రామాల్లో సెక్రటరీలను పంపించి పారిశుధ్య కార్మికులతో పనులు చేయించినట్లు పేర్కొన్నారు.

కండక్టర్ మృతిపై సంతాప సభ

జమ్మలమడుగు, జూలై 17: జమ్మలమడుగు ఆర్టీసీ డిపో ఆవరణలో బుధవారం ఆర్టీసీ కార్మికులు సంతాప సభ నిర్వహించారు. జమ్మలమడుగు ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో కండక్టర్ చౌడం జొల్లు తారకరాముడు ఆకస్మిక మరణంపై డిపో ఉద్యోగులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, పెద్దిరాజు, డిపో కార్యదర్శి శివుడు, గ్యారేజీ వలి, కార్మికులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దోపిడీపై శ్వేత పత్రం విడుదల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు ,జూలై 17 : వైసీపీ ఐదేళ్ల దోపిడీ పాలనలో జరిగిన అక్రమాలపై టీడీపీ ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసిందని ఎమ్మెల్యే నంద్యాల వ ర ద రా జు ల రె డ్డి తెలిపారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో 1.75 లక్షల ఎకరాలు భూములు స్వాహా చేసి 35.576 కోట్లు అక్రమంగా దోపిడీ చేశారన్నారు. రాష్ట్రంలో 10 వేల కోట్ల ఇసుక అక్రమ రవాణాలో దోచుకున్నారన్నారు దుర్మార్గమైన ల్యాండ్‌టైట్లింగ్ చట్టం తెచ్చి రైతులు,సామాన్యుల భూములు కొల్లగొట్టాలని చూశారన్నారు. అందుకే నేడు టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే ల్యాండ్‌టైటిల్ చట్టాన్ని రద్దు చేసిందన్నారు. రాష్ట్రంలో జరిగిన భూ సర్వే అనేక అక్రమాలకు తెరలేపడమే కాకుండా సమస్యలు సృష్టించిందన్నారు. భూసర్వేలో రాళ్ళ పై జగన్‌బొమ్మ వేసుకోవడానికి జగన్‌కు ఏం హక్కు వుందన్నారు. పట్టాదారు పాసు పుస్తకాలపై కూడా జగన్ బొమ్మ వేసుకుని రైతుల ఆత్మగౌరవం దెబ్బతీశారన్నారు. రాష్ట్రంలో జగనన్న కాలనీల పేరిట జరిగిన భూ కుంభకోణం చాలా పెద్దది అన్నారు.వేలాది సెంటు ఇళ్లను ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొం దన్నారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు సాగించిన భూ దందాలపై త్వరలో సమగ్ర విచారణ జరుపుతామన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ కౌన్సిలర్లు ఎర్రన్న, తలారి పుల్లయ్య, వక్ఫ్ బోర్డు మాజీ డైరెక్టర్ మున్నా, టౌన్ బ్యాంక్ డైరెక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'శ్వేత పత్రాలతో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు'

చాపాడు, జూలై 17: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు విడుదల చేసిన శ్వేత పత్రాలతో మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకుల వెన్నులో వణుకు పుట్టుతోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు పోలవరం, అమరావతి, విద్యుత్తు, భూకబ్జాలు వంటివాటిపై శ్వేత ప్రాలు విడుదల చేశారన్నారు.

హౌసింగ్‌బోర్డు కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 17: గోపవరం పంచాయతీలోని హౌసింగ్ బోర్డు షిఫ్ట్ పేస్ కాలనీ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఆ కాలనీ ప్రజలు బుధవారం కామనూరులో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో సరైన కాలువలు లేకపోవడంతో మురికినీరు ఇళ్లమధ్యనే నిలిచి దుర్గంధం, విపరీతమైన దోమలు వ్యాపించాయన్నారు. కాలనీకి ఉప్పునీరు సరఫరా చేస్తున్నారని, పెన్నానది నీరు సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కాలనీలో పార్కుకు కేటాయించిన స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 17: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్‌సీ అమలులో జాప్యం జరిగే అవకాశం ఉన్నందున ప్రభుత్వం వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మునివర్ధన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



భక్తి శ్రద్ధలతో తొలిఏకాదశి పూజలు

జమ్మలమడుగు, జూలై 17: మండల పరిధిలోని కన్యతీర్థంలో బుధవారం ఆషాఢ మాస శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ శివనాథరెడ్డి ఆధ్వర్యంలో బాల త్రిపుర సుందరీదేవి, సుందరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు ఉపవాసంతో విష్ణుమూర్తికి పూజలు చేస్తే పాపాలు తొలగిపోతాయని పండితులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి భక్తులు అత్యధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణంలో చండీహోమం తదితర కార్యక్రమాలు జరిగాయి.

ప్రొద్దుటూరు టౌన్..: శ్రీరాములపేటలోని రుక్మిణి, పాండురంగస్వామి ఆలయంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. సత్యనారాయణస్వామి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కలశంలోకి స్వామివారిని ఆవాహన చేసి భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతం ఆచరించారు. సాయంత్రం మహిళలు సామూహికంగా విష్ణు సహస్రపారాయణం చేశారు.

కొండాపురం..: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలో పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.కొండాపురం రామాలయంతో పాటు పలు ఆలయాల్లో పత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కాశినాయన..: తొలిఏకాదశి పడుగను పురస్కరించుకొని బుధవారం మండలంలోని జ్యోతిక్షేత్రంతోపాటు ఇతర దేవాలయాలల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చెన్నవరం శివాలయం,అక్కంపేట విభూదిశివాలయం జ్యోతి కాశిరెడ్డి నాయన ఆలయాల్లో ప్రత్యేక పూజలు భజనకార్యక్రమాలు ఏర్పాటుచేశారు.



పోరుమామిళ్లలో పూజలు చేస్తున్న భక్తులు

పోరుమామిళ్ళ..: తొలి ఏకాదశి వేడుకలు పోరుమామిళ్ళలో ఘనంగా జరిగాయ. బుధవారం పోరుమామిళ్ళలోని అన్ని దేవాలయాలలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

ఖాజీపేట..: తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయం, షిరిడీసాయిబాబా ఆలయం, కన్యకాపరమేశ్వరీదేవి ఆలయం, నాగనాథేశ్వరకోనలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి మహిళలు ఉపవాసంతో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు.

బ్రహ్మంగారిమఠం..: వీర బ్రహ్మేంద్రస్వామి సన్నిధిలో బుధవారం తొలి ఏకాదశి పండుగ సందర్భంగా భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ భజన కార్యక్రమాలు బుధవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమై మరుసటి రోజు గురువారం ఉదయం 8 గంటల వరకు 24 గంటలు భజన కార్యక్రమాన్ని భక్తులు నిర్వహిస్తామన్నారు. అలాగే వీర బ్రహ్మేంద్రస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.